

గోదావరి తీర ప్రాంతంలో జలకళ

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి తీర ప్రాంతాల్లోని చెరువులు, ప్రాజెక్టులు వరద నీటితో జలకళ సంతరించుకున్నాయి.

- 8లో▸



కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలి

కాళోజీ కళాక్షేత్రానికి ప్రజాయుద్ధ నౌక గద్దర్, చుక్క సత్తయ్య పేరు పెట్టాలని ప్రొఫెసర్ కంచె ఐలయ్య డిమాండ్ చేశారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
26^{0} / 24^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత భారీ వర్షాలు కురుస్తాయి. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మాత్రా, సర్వమంగళ క్రమంలో అమ్మవారు





హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో జరుగుతున్న శాకంబరీ నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి మాత్రా, సర్వ మంగళ క్రమాల్లో పూజలు జరిపారు. ఉదయం నుంచి ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం దేవాలయంలో అమ్మవారి మహా శాకంబరీ అలంకారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి కూరగాయలు, పండ్లు సమర్పించాలనుకునే భక్తులు శనివారం సాయంత్రం 5గంటల వరకు దేవాలయ కార్యాలయంలో అందించాలని, ఆతర్వాత ఇచ్చిన కూరగాయలు, పండ్లు అనుమతించబడవని ఆలయ ఈఓ శేషు భారతి తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో పద్మాక్షి అమ్మవారు



హన్మకొండ అర్బన్: శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి పద్మాక్షి అమ్మవారు శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శమిచ్చినట్లు ఆలయ అర్చకులు నాగిళ్ల శంకర్ శర్మ, నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించినట్లు పేర్కొన్నారు. అనంతరం మల్లెలు, చామంతులు, గులాబీ పూలు, దానిమ్మ, నిమ్మకాయల మాలలతో అలంకరించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న టీజీ డీఎస్సీ

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో టీజీ డీఎస్సీ పరీక్షలు ఐదు కేంద్రాల్లో కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన ఈపరీక్షల్లో ఉదయం సెషన్‌లో 1,212 మందికిగాను 1,164 మంది (96.03శాతం) హాజరుకాగా.. 48 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈఓ వాసంతి తెలిపారు. రెండో సెషన్‌లో 1,212 మంది అభ్యర్థులకు 1,177 మంది(97.11శాతం) మంది అభ్యర్థులు హాజరవ్వగా 35 మంది గైర్హాజరైనట్లు డీఈఓ తెలిపారు. ఈ పరీక్షలు ఆగస్టు 5వరకు.. రోజుకు రెండు సెషన్లు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు.

కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తి చేయండి: కలెక్టర్



హన్మకొండ కల్చరల్/నయీంనగర్: కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనుల్ని ఆగస్టు 15 వరకు పూర్తి చేయాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. శుక్రవారం బాలసముద్రంలో నిర్మాణంలో ఉన్న కాళోజీ కళాక్షేత్రం పనుల్ని కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, నిబంధనల మేరకు నిర్మాణం పూర్తి చేయాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, 'కుడా' పీఓ అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8 నెలల్లో కాంగ్రెస్ చేసిందేమీ లేదు

హన్మకొండ: మార్పు తెస్తామని, అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 8 నెలలవుతున్నా.. చేసింది శూన్యమని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. శుక్రవారం హనుమకొండ బాల సముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రైతు బంధు, రైతు బీమా, దళిత, బీసీ, మైనార్టీ బంధు, కేసీఆర్ కిట్, సాగు నీరు బందయ్యాయని తూర్పారబట్టారు. చేతల ప్రభుత్వం అనుకుంటే కోతల పర్వం సాగుతోందని ధ్వజమెత్తారు. రుణమాఫీ లబ్ధిదారుల్లోనూ కోతలు విధించారని, ప్రతీ పథకంలో కోతలేనని దుయ్యబట్టారు.

అనధికారిక ప్లాట్లు..

అక్రమ నిర్మాణాలు

- ఒకరిద్దరి గుత్తాధిపత్యంలో రెండెకరాల పేదల భూమి
- ప్లాట్లు చేసి రిజిస్ట్రేషన్ లేకుండానే విక్రయాలు
- ఎలాంటి అనుమతి లేకుండా భవనాల నిర్మాణం
- నోటీసులకే పరిమితమైన మున్సిపల్ అధికారులు



రాజీపేటలో మున్సిపల్ అనుమతి లేని భవన నిర్మాణం



తమ భూములు ఇప్పించాలంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న పేదలు

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఒక వైపు ప్రభుత్వ భూముల ఆక్రమణ, దీంతో పాటు మున్సిపాలిటీ విలీన గ్రామాలు రాజీపేట, సీతారాంపూర్‌లో అనుమతిని లేని అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈవిషయంపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరకాల మున్సిపాలిటీలో విలీనంతో రాజీపేట, సీతారాంపూర్‌లో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. కొద్ది రోజులుగా గుంట లెక్కన ఉన్న ధరలు.. ప్రస్తుతం గజాల లెక్కన విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 120 గజాలకు రూ.10 లక్షలపైనే ధర పలుకుతోంది. రాబోయే రోజుల్లో మరింత ధర పెరగొచ్చని ఊహించి ఎంత ధరైనా పెట్టి కొనుక్కునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇదే అంశాన్ని ఆసరాగా చేసుకొని కొందరు అడ్డదారిలో భూముల్ని విక్రయిస్తున్నారు. ఆయా భూములు కొన్నవారు కనీసం ఇంటి అనుమతికి దరఖాస్తు చేసుకోకుండానే భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. అక్రమ నిర్మాణ పనులపై స్థానిక కౌన్సిలర్‌తో పాటు గ్రామస్తులంతా జిల్లా ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. మమ్మల్ని అడ్డుకునేదెవరు అంటూ కొందరైతే రెండు, నుంచి మూడంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు.

గుత్తాధిపత్యం..

రాజీపేట శివారులోని 18 సర్వే నంబర్ భూమిని 30 ఏళ్ల క్రితం అప్పటి మండల రెవెన్యూ అధికారి జీఎం.షా 40 మంది నిరుపేదలకు పంపిణీ చేశారు. అయితే భూమి ఇప్పించడానికి తాము ఎంతో కష్టపడ్డామని, అధికారుల చుట్టూ తిరగడానికి చాలా ఖర్చయ్యిందని అదే గ్రామానికి చెందిన కొందరు.. పేదల నుంచి డబ్బులు దండుకున్నారు. కొందరు డబ్బులివ్వగా.. మరికొందరు తిరస్కరించారు. అలా తిరస్కరించిన వారి నుంచి భూమి కాగితాలను లాక్కున్నారు. వారి వారసత్వంలోని ఓ మహిళతో మరొకరు ఆయా భూములను రిజిస్ట్రేషన్ లేకుండా గుంటకు రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విక్రయిస్తున్నారు. అది కూడా స్టాంప్ కాగితం రాసిచ్చి మాత్రమే. కొనుగోలు చేసిన వారంతా ఎలాంటి డాక్యుమెంటేషన్ లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోకుండానే వేగంగా భవన నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. కాగా.. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం తమకేమీ పట్టదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణదారులకు నోటీసులిచ్చాం..

పరకాల మున్సిపాలిటీ విలీన గ్రామం రాజీపేటలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చాయి. మున్సిపాలిటీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను అప్రమత్తం చేశాం. నిర్మాణదారుల వద్ద ఎలాంటి డాక్యుమెంటేషన్ లేకపోవడంతో ఆరు అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు గుర్తించాం. వారందరికీ నోటీసులు జారీ చేశాం. ఆయా నిర్మాణాలపై తప్పకుండా చర్యలుంటాయి.

- కె.నర్సింహ, మున్సిపల్ కమిషనర్, పరకాల

గ్రామ సింహాలతో గజగజ!

పిచ్చికుక్కల స్వైర విహారం

- కమలాపూర్‌లో ఒక్కరోజే 21 మందిపై దాడి
- నెలన్నర వ్యవధిలో 120 మందికి గాయాలు
- తీవ్ర భయాందోళనలో మండల ప్రజలు
- కుక్కల బారినుంచి కాపాడాలని వేడుకోలు





కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులు (ఫైల్)

కమలాపూర్: కమలాపూర్ మండలం వ్యాప్తంగా వీధి కుక్కలు, పిచ్చి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. కమలాపూర్‌లో ఇటీవల ఒక్క రోజే ఓ పిచ్చి కుక్క దాడి చేసి ఏకంగా 21 మందిని కరిచి గాయపర్చింది. దీంతో కమలాపూర్‌తోపాటు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కుక్కల బారి నుంచి తమను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నెలన్నర వ్యవధిలో 120 మందిపై..

కమలాపూర్ మండల వ్యాప్తంగా గడిచిన నెలన్నర (జూన్ 1 నుంచి జూలై 15 వరకు) వ్యవధిలో కుక్కలు కమలాపూర్‌లో 35 మంది, మర్రిపల్లిగూడెంలో 10 మంది, అంబాల, గుండేడు గ్రామాల్లో 9 మంది, గూడూరులో 8 మంది, శంభునిపల్లిలో ఆరుగురు, శనిగరంలో ఐదుగురు ఇలా.. మండలవ్యాప్తంగా మరికొన్ని గ్రామాల్లో కలిపి మొత్తం 120 మందిపై దాడి చేసి గాయపర్చాయి. ఈనెల 15న కమలాపూర్‌లో పిచ్చికుక్క దాడిలో ఒక్కరోజే 21 మందికి గాయాలయ్యాయంటే కుక్కలు ఏ రకంగా స్వైర విహారం చేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

పాదచారులు, వాహనదారుల వెంట పడుతున్న కుక్కలు..

కమలాపూర్, గూడూరు, అంబాల, మర్రిపల్లిగూడెం, శనిగరం, కానిపర్తి, శంభునిపల్లి తదితర గ్రామాల్లో వీధి కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయింది. ఎంతగా అంటే గుంపులు గుంపులుగా రోడ్లపైకి చేరి పాదచారులు, వాహనదారులపై దాడికి దిగుతున్నాయి. వాహనదారులను వెంబడిస్తూ ప్రమాదాల బారిన పడేలా చేస్తున్నాయి. ఇలా పలువురు వాహనదారులు తీవ్ర గాయాలపాలయ్యారు.

సైకిల్ మీద పోతాంటె కరిచింది



నేను కూలి పని చేసుకుని బతుకుతున్నా. తాపీ పని చేయడానికి సైకిల్ మీద పోతాంటే చిన్న బడి దగ్గర పిచ్చి కుక్క నా మీద పడి కరిచింది. పిచ్చి కుక్క దాడిలో నా ఎడమ మోచేతికి తీవ్ర గాయమైంది. మూడు రోజులు దావఖాన్ల ఉండి చికిత్స చేయించుకొని ఇంటికి వచ్చిన. కుక్క కరిచినప్పటి నుంచి పనికి పోవుడు బందైంది.

- మాట్ల శ్రీనివాస్, కమలాపూర్

పాల ప్యాకెట్ తెత్తాంటె కరిచింది..



నేను కమలాపూర్‌లోని బీసీ కాలనీలో డబుల్ బెడ్రూం దగ్గర ఉంటున్న. దుకాండ్లకు పోయి పాల ప్యాకెట్ తెత్తాంటె పిచ్చి కుక్క ఎగబడి కరిసింది. నా కుడి చేతికి తీవ్ర గాయమైంది. దావఖాండ్లకు పోతె మూడు రోజులు ఉంచుకొని చికిత్సలు చేసి ఇంటికి పంపించిండ్లు. ఇంకా చేతి నొప్పి, గాయం తగ్గలేదు.

- కనుకుంట్ల ప్రమీల, కమలాపూర్

హనుమకొండ డీఎంహెచ్ఓగా అప్పయ్య



ఎంజీఎం : హనుమకొండ డీఎంహెచ్ఓగా డాక్టర్ అల్లెం అప్పయ్య నియమితులయ్యారు. ములుగు డీఎంహెచ్ఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు హనుమకొండ డీఎంహెచ్ఓగా పనిచేసిన సాంబశివరావు వరంగల్‌కు బదిలీ అయ్యారు. హనుమకొండ డిప్యూటీ డీఎంహెచ్ఓ యాకూబ్‌పాషా వరంగల్‌లోని సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆర్ఎంఓగా బదిలీ అయ్యారు. జనగామ డీఎంహెచ్ఓ హరీశ్‌రాజు మంచిర్యాలకు బదిలీపై వెళ్లారు.

వరంగల్ డీఎంహెచ్ఓగా సాంబశివరావు



గీసుకొండ: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)గా సాంబశివరావు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన ఇంతవరకు హనుమకొండ డీఎంహెచ్ఓగా విధులు నిర్వర్తించి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే, ఇక్కడ డిప్యూటేషన్‌పై డీఎంహెచ్ఓగా పనిచేసిన కె.వెంకటరమణ కరీంనగర్‌కు వెళ్లారు. అదనపు డీఎంహెచ్ఓ సుధార్‌సింగ్ సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి ఆర్ఎంఓగా బదిలీ అయ్యారు.

113 మంది కానిస్టేబుళ్ల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్‌స్టేషన్లలో ఐదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న 113 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. కౌన్సెలింగ్ పద్ధతిలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వారు ఎంపిక చేసుకున్న పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు.

చెరువుల్లో నిర్మాణాలా..!



గతేడాది వర్షాకాలంలో నీట మునిగిన వరంగల్ భద్రకాళి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధి నిర్మాణాలు

వరంగల్ అర్బన్: ముందు చూపు లేకుండా.. ఏమవుతుందిలే అనే ధీమాతో చెరువుల పరిధిలో భవనాలు నిర్మించుకున్న వారి పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. నగరంలోని ప్రధానమైన నాలుగు చెరువుల పరిధిలో బఫర్ జోన్, ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్)లో భవనాలు నిర్మించుకున్న యజమానులకు బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో వారిలో భయాందోళన వ్యక్తమవుతోంది. 2010లో హైకోర్టులో దాఖలైన కేసు తాజాగా ఫైనల్ విచారణకు రావడం, రాష్ట్ర ప్రభుత్వం కూడా బఫర్, ఎఫ్‌టీఎల్ జోన్లలో నిర్మాణాల్ని కఠినంగా వ్యవహరించాలన్న ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రస్తుతం హడావుడి చేస్తున్నారు.

భవన యజమానులకు నోటీసులు

వరంగల్‌లోని భద్రకాళి, చిన్నవడ్డేపల్లి, కోట చెరువు, బంధం చెరువుల పరిధిలోని బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో పెద్ద ఎత్తున భవన నిర్మాణాలు జరిగాయి. 1998లో అప్పటి కమిషనర్ సూచనల మేరకు సమీపంలోని ఖాళీ స్థలాల యజమానులు కొంతమేరకు బల్దియాకు సొమ్ము చెల్లించారు. ఈ సొమ్ముతో నాలుగు చెరువులకు ప్రత్యేకంగా బండ్ నిర్మించారు. ఈనేపథ్యంలో బండ్‌ను హద్దుగా భావించిన ఖాళీ స్థలాల యజమానులు పెద్దఎత్తున భవన నిర్మాణాలు చేపట్టారు. అంతేకాకుండా బల్దియా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, నల్లా కనెక్షన్లు, ఇంటి నంబర్లు, ఇతరత్రా వసతులు కల్పించింది. కానీ గతేడాది వర్షాకాలంలో ఈ నిర్మాణాలన్నీ నీటమునిగాయి. చాలామంది బల్దియా కల్పించిన షెల్టర్లలో తలదాచుకున్నారు.

700 మందికి నోటీసులు

హైదరాబాద్ ట్యాంక్ బండ్‌ను మరిపించే రీతిలో నాలుగు చెరువుల పరిధిలో పర్యాటకం పేరిట రియల్టర్లు, దళారులు అరచేతిలో వైకుంఠం చూపించారు. అమాయకులకు ప్లాట్లను అంటగట్టారు. ముందుచూపులేకుండా తక్కువ ధరకు వస్తుందనుకున్న చాలామంది కొనుగోలు చేసి, ఇళ్లను నిర్మించుకున్నారు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధి బల్దియా భవనాలకు అనుమతులు జారీ చేయకున్నా భవనాలను నిర్మించుకున్నారు. తాజాగా నాలుగు చెరువుల పరిధిలోని సుమారు 700 మంది భవన యజమానులకు నోటీసులు జారీ అయ్యాయి. 'మీరు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పరిధిలో అనుమతి లేకుండా భవనాలు నిర్మించారు. దీనిపై వివరణ ఇవ్వండి' అంటూ అందులో పేర్కొన్నారు. దీంతో యజమానులు ఆందోళన చెందుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

వంట మాస్టర్‌పై అడిషనల్ కలెక్టర్ ఆగ్రహం

వరంగల్ స్పోర్ట్స్: జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని శుక్రవారం ఉదయం హనుమకొండ అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా సందర్శించారు. స్టేడియం ఆవరణలోని రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా క్రీడాకారులకు అందజేస్తున్న పాలు, బ్రేక్‌ఫాస్ట్‌పై అసహనం వ్యక్తం చేశారు. ఇంత పలుచగా ఉన్న పాలు క్రీడాకారులకు ఇస్తే ఎలా అంటూ.. అక్కడే ఉన్న వంట మాస్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రీడాకారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేడియం ఆవరణలో నిర్మిస్తున్న రెజ్లింగ్, కబడ్డీ ఇండోర్ హాల్ నిర్మాణ పనుల్ని పరిశీలించారు. ఔట్‌డోర్‌లో గార్డెనింగ్‌తో అందంగా తీర్చిదిద్దాలని, క్రీడాకారులకు, బాల బాలికలకు వేర్వేరుగా నూతన వసతి గృహ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాలని వెంట ఉన్న డీవైఎస్ఓ అశోక్‌ను ఆదేశించారు. ఇటీవల బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 400, 1,500 మీటర్ల రన్నింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన జిల్లాకు చెందిన అఖిలానందన్‌ను ఆమె అభినందించారు. కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ రాధికాగుప్తాను కలిసి డ్రాగన్ ఫ్రూట్ అందిస్తున్న రైతు మహ్మద్ రంజాన్

రైతును అభినందించిన అదనపు కలెక్టర్

హన్మకొండ అర్బన్: జిల్లాలోని దామెర మండలం సీతారాంపూర్ గ్రామ రైతు మహ్మద్ రంజాన్ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా తన వ్యవసాయ పొలంలో డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేసి అధిక దిగుబడి సాధించినందుకు హనుమకొండ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అభినందించారు. ఈమేరకు శుక్రవారం డీఆర్డీఓ పీడీ నాగపద్మజ, రైతు మహ్మద్ రంజాన్.. కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ రాధికాగుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. రైతు పండించిన డ్రాగన్ ఫ్రూట్స్‌ను బహూకరించారు. ఈసందర్భంగా అధికారులు రైతును, మండల సిబ్బందిని అభినందించారు.

పేదల భూమిపై పెద్దల కన్ను



ప్లాట్లు కొన్న వ్యక్తులు

వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూముల ధరలు పెరిగిపోతుండడంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. నకిలీ పత్రాలు తీసుకొచ్చి గూండాలను ఉసిగొల్పి దాడులకు యత్నిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇలాంటి ఘటనలు నగరంలో నిత్యకృత్యమయ్యాయి. తాజాగా.. ములుగు రోడ్డు సమీపంలో 25 మంది పేద, మధ్యతరగతి ప్రజలు తమ భవిష్యత్ అవసరాల కోసం ప్లాట్లు కొనుగోలు చేయగా.. ఆ భూమిపై హనుమకొండలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రి యజమాని కన్ను పడింది. ఆ భూమి తనదేనని వాదిస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ప్లాట్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ ములుగు రోడ్డులోని అయ్యప్ప గుడి సమీపం ఇస్కాన్ టెంపుల్‌కు ఎదురుగా మెయిన్ రోడ్డుకు రెండో బిట్‌లో ఎకరం 35 గుంటల భూమిని 1982లో పోలం రామచంద్రారెడ్డి ద్వారా కొండపర్తి భాస్కరరావుకు జీపీఏ (జనరల్ పవర్ ఆఫ్ అటానమీ)చేశారు. ఆయన ఎకరం 35 గుంటలను 300 గజాల చొప్పున 25 ప్లాట్లుగా చేసి 25 మందికి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. అప్పటి నుంచి ఈ భూమి 25 మంది సభ్యుల ఆధీనంలో ఉంది. 2018లో ఓ వ్యక్తి వచ్చి ఈ భూమి తనదేని దబాయిస్తూ వెంట పది మంది మనుషులను కాపలా పెట్టి అసలైన భూ యజమానులను భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో 25 మంది ప్లాట్ల యజమానులు ఒక సంఘంగా ఏర్పడి హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి సదరు కబ్జాకు యత్నించిన వ్యక్తులను తీసుకెళ్లారు. ఇది జరిగిన కొద్ది రోజులకే ఓ వ్యక్తి వద్ద తాను భూమిని కొనుగోలు చేశానంటూ వచ్చాడని, తమ భూమి అక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈభూమిపై 2018లో ప్లాట్ల యజమానులు కోర్టును ఆశ్రయించారు. ఈకేసులో న్యాయమూర్తి బాధితుల పక్షాన ఇంజెక్షన్ ఆర్డర్ జారీ చేసినట్లు తెలిపారు. కేసు వేసి ఇప్పటికి నాలుగేళ్లు దాటినా.. ఎదుటి పక్షం వాళ్లు కోర్టుకు రాకపోవడంతో వాయిదా తీర్మానాలతో గడుస్తోందని ప్లాట్ల యజమానులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ అప్పటి వరంగల్ సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఏనుమాముల పోలీస్‌స్టేషన్ సీఐ మహేందర్‌ను ఆదేశించారు. సీఐ విచారణ చివరి దశకు చేరుకున్న సమయంలోనే సీపీ రంగనాథ్ బదిలీ కావడంతో ఈ వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఆ నివేదిక కోసం పోలీస్ అధికారులను సంప్రదించగా.. లేదని చెప్పారని, ఆక్రమణపై తమ ఎదుటి వారిని పత్రాలు తీసుకురావాలని చెప్పినా.. రాకుండా ఆస్పత్రి యజమాని మేనేజ్ చేస్తూ.. తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 42 ఏళ్ల క్రితం ప్లాట్లు కొన్నప్పటికీ.. తమను ఇన్ని ఇబ్బందులకు గురిచేస్తున్న ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని బాధితులు జిల్లా యంత్రాంగాన్ని కోరుతున్నారు.

అంగన్వాడీలో ముర్రిగిన గుడ్ల పంపిణీ!

ఖిలా వరంగల్: వరంగల్ 32వ డివిజన్ కరీమాబాద్ ఏరియాలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నపిల్లల తల్లులు, గర్భిణులకు ముర్రిగిపోయిన గుడ్లను పంపిణీ చేసినట్లు సమాచారం. దీనిపై అంగన్వాడీ కేంద్రం టీచర్‌ను బాధిత మహిళ నిలదీస్తే తామేమీ చేయలేమని, ఉన్నతాధికారులకు సమాచారం అందించామని, సెంటర్‌కు వచ్చిన గుడ్లను మాత్రమే పంపిణీ చేసినట్లు సమాధానం చెప్పినట్లు తెలిసింది. కరీమాబాద్‌లోని ఓ అంగన్వాడీ కేంద్రంలో ముర్రిగిన గుడ్ల పంపిణీ అంటూ సోషల్ మీడియాలో ఈ విషయం చక్కర్లు కొట్టింది. ఇప్పటికైనా ఐసీడీఎస్ అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన గుడ్లు పంపిణీ చేయాలని గర్భిణులు కోరుతున్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ

భూపాలపల్లి అర్బన్ : భూపాలపల్లి మండలం రాంపూర్ శివారు అడవుల్లో గత మే నెలలో గుర్తు తెలియని మృతదేహం లభించిన విషయం తెలిసిందే. ఈ మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అనంతరం ముగ్గురిని అరెస్ట్ చేశారు. కూతురుకు 20 గుంటల భూమిని ఇవ్వకుండా అడ్డు పడుతున్నాడని కుమారుడిని తండ్రి చంపించాడు. ఈ మేరకు శుక్రవారం భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రందాన్‌తండాకు చెందిన గుగులోతు ప్రభాకర్(29)ను పర్వతగిరి మండలం తురకల సోమవారం గ్రామానికి చెందిన బానోత్ బాలాజీ, బానోత్ సిద్దు, బానోత్ శ్రీను ఏప్రిల్ 23వ తేదీన భూపాలపల్లి మండలం గొల్లబుద్దారం తండాలో పెళ్లి సంబంధం ఉందని పథకం ప్రకారం తీసుకొచ్చారు. మార్గమధ్యలో రాంపూర్ అటవీ ప్రాంతంలో మద్యం సేవించి ప్రభాకర్ తలపై బండతో కొట్టి వారి వెంట తీసుకొచ్చిన పెట్రోల్ పోసి నిప్పు అంటించి పారిపోయారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు పట్టణ సమీపంలోని కేటీకే–5వ గని వద్ద ఎస్సై ప్రసాద్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ ఆటోలో ఈ ముగ్గురు వచ్చి పోలీసులను చూసి పారిపోయే యత్నం చేశారు. వారిని పట్టుకుని విచారించారు. మృతుడి తండ్రి నరసింహస్వామి తన కొడుకు ప్రభాకర్‌ను చంపితే రూ.50వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనికి ఒప్పుకున్న బానోత్ బాలాజీ అతడి కొడుకు సిద్దు, తమ్ముడు శ్రీను పథక ప్రకారం పెళ్లి సంబంధం ఉందని ప్రభాకర్‌ను రాంపూర్ అడవికి తీసుకొచ్చి హతమార్చినట్లు నేరం ఒప్పుకున్నారన్నారు. మృతుడు తన చెల్లికి 20 గుంటల భూమి ఇవ్వకుండా అడ్డుపడుతున్నాడని హత్య చేసినట్లు తెలిపారు. దీంతో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ నరేశ్, ఎస్సై ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి


భవాని(ఫైల్)

ఆత్మకూరు: మాయదారి మృత్యువు మాటు వేసి కాటువేసింది. రెండు నిమిషాలైతే గమ్యానికి చేరేది. అంతలోనే అనంత లోకాలకు తీసుకెళ్లింది. లారీ రూపంలో మింగింది. మండలంలోని గూడెప్పాడ్ జంక్షన్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా భర్త, కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గూడెప్పాడ్‌కు చెందిన బలబద్ర దినేశ్ వరంగల్ నుంచి బైక్‌పై భార్య భవాని(23) ఏడాదిన్నర కుమారుడితో వస్తున్నాడు. రెండు నిమిషాల్లో గూడెప్పాడ్‌కు చేరుకునే క్రమంలో పరకాల నుంచి వరంగల్ వైపునకు వెళుతున్న లారీ ఢీకొనడంతో వీరందరికీ తీవ్రగాయాలయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న సీఐ సంతోష్, సిబ్బంది తమ వాహనంలో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించగా భవాని మృతిచెందింది. ఈ ఘటనపై సీఐ సంతోష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరి తీర ప్రాంతంలో జలకళ

రెండు రోజుల నుంచి గోదావరి తీర ప్రాంతంలో జోరు వాన కురుస్తోంది. దీంతో వాగులు, వంకలు, ఉప్పొంగుతున్నాయి. ములుగు జిల్లాలోని పాలెం ప్రాజెక్టు వరద నీటితో కళకళలాడుతోంది. అలాగే, రామప్ప సరస్సు నీటి మట్టం 24 అడుగులకు చేరింది. కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క సాగర్ వద్ద గోదావరి ప్రవాహం కొనసాగుతోంది. వరద ఉధృతికి కొన్ని గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాగా, శుక్రవారం నుంచి మరో నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ప్రజలు అప్రత్తంగా ఉండాలని అధికారయంత్రాంగం పేర్కొంది.


నిండుకుండలా కనిపిస్తున్న పాలెం ప్రాజెక్టు

వెంకటాపురం(కె): వెంకటాపురం మండలం మల్లాపురం సమీపంలో నిర్మించిన పాలెం వాగు ప్రాజెక్టు శుక్రవారం జలకళ సంతరించుకుంది. మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువ ప్రాంతం చత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు కళకళలాడుతోంది. సామర్థ్యానికి మించి వరద చేరడంతో ప్రాజెక్టు సంబంధించిన నాలుగు గేట్లను ఎత్తి వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, ప్రాజెక్టు నిండడంతో మండల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగి తగ్గుతున్న గోదావరి

వాజేడు మండలం పేరూరు వద్ద గోదావరి ఉధృతంగా పెరిగి నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. పేరూరు వద్ద శుక్రవారం సాయంత్రం గోదావరి నీటి మట్టం 12.73 మీటర్లకు చేరుకుంది. సాయంత్రం నుంచి తగ్గ ముఖంపట్టింది. రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి ఉధృతి పెరిగింది. ఎడ తెరిపి లేకుండా కురిసిన వర్షం సైతం తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పూసూరు హైలెవల్ బ్రిడ్జి వద్ద గోదావరి వరద పరవళ్లు తొక్కుతోంది.

24 అడుగులకు చేరిన 'రామప్ప' నీటిమట్టం


నీటితో కళకళలాడుతున్న రామప్ప సరస్సు

వెంకటాపురం(ఎం): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రామప్ప సరస్సు నీటిమట్టం 24 అడుగులకు చేరింది. 35 అడుగుల నీటి సామర్థ్యం గల సరస్సులో గతంలో 20.6 అడుగుల నీరు ఉండగా ప్రస్తుతం 3.6 అడుగుల మేర వర్షపు నీరు చేరడంతో సరస్సు నీటితో కళకళలాడుతుంది. రామప్ప సరస్సు అధికారికంగా 5180 ఎకరాలు, అనధికారికంగా మరో 5 వేల ఎకరాలు సాగవుతాయి. కాగా సరస్సు నీటితో కళకళలాడుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


సమ్మక్క సాగర్ వద్ద తగ్గుతున్న గోదావరి ఉధృతి

శాంతించిన గోదావరి

- తగ్గుతున్న వరద ప్రవాహం
- సమ్మక్కసాగర్ వద్ద 3,75,430 క్యూసెక్కులు

కన్నాయిగూడెం: రెండు రోజుల నుంచి ఉధృతంగా ప్రవహించిన గోదావరి శుక్రవారం మధ్యాహ్నం నుంచి శాంతించింది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క సాగర్ వద్ద గోదావరి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఉదయం బ్యారేజీ వద్ద 3,82,057 క్యూసెక్కులు ఉన్న వరద ప్రవాహం సాయంత్రం వరకు 3,75,430 వరకు చేరింది. బ్యారేజీలో 78.50 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది. గురువారం వరకు 52గేట్లతో నీటిని వదిలిన అధికారులు శుక్రవారం 59 గేట్లు తెరిచి నీటిని దిగువకు వదిలారు. గురువారం వరకు దేవాదుల పంపింగ్‌ను కొనసాగించిన అధికారులు శుక్రవారం నిలిపివేశారు

కాటారం మండలంలో భారీ వర్షం

- అలుగువాగులో కొట్టుకుపోయిన ఆటో


గుమ్మాళ్లపల్లిలో కూలిన ఇంటి గోడ

కాటారం: కాటారం మండలంలో గురువారం అర్ధ రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని చెరువులు, వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. పోతులవాయి సమీపంలోని బొర్రవాగు, గంగారం వద్ద గల చిన్న వాగు, ఒడిపిలవంచ వద్ద గల వాగు, దామెరకుంట–గుండ్రాత్‌పల్లి మధ్య గల అలుగువాగులో వరద నీరు ఉధృతి ఎక్కువై ప్రధాన రహదారిపై గల కాజ్‌వేల పైనుంచి ప్రవహించాయి. దీంతో ఆయా గ్రామాలకు ఉదయం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం తెల్లవారుజామున మహదేవపూర్ మండలం అన్నారం వైపు నుంచి దామెరకుంట వైపుగా వెళ్తున్న ట్రాలీ ఆటో గుండ్రాత్‌పల్లి సమీపంలో గల అలుగువాగులో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తమై ఆటో ఎక్కి కేకలు వేయడంతో గమనించిన స్థానికులు రక్షించారు. గుమ్మాళ్లపల్లి ఎస్సీ కాలనీలో వరదనీరు ఇళ్లలోకి చేరింది. సమ్మక్క ఇంటి గోడలు కూలిపోయాయి. ఆయా గ్రామాల్లో పత్తి చేలలోకి వరదనీరు చేరింది. అలుగువాగు, బొర్రవాగు వరదనీటి ఉధృతిని తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ వెంకన్న పరిశీలించారు. వాగుల్లో ఉధృతి తగ్గే వరకూ రాకపోకలు సాగించొద్దని సూచించారు. ఎస్సై మ్యాక అభినవ్ ఆధ్వర్యంలో వాగుల వద్ద పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

వాగు వద్ద నిలిచిన అంబులెన్స్



కాటారం: వాగులో నీటి ఉధృతి కారణంగా అంబులెన్స్ మార్గమధ్యలో నిలిచింది. ఈ ఘటన కాటారం మండలం పోతుల్వాయి సమీపంలో కాటారం–మహాముత్తారం ప్రధాన రహదారిపై గల బొర్రవాగు వద్ద చోటు చేసుకుంది. మహాముత్తారం మండలం నిమ్మగూడేనికి చెందిన తాడాంద్ర శంకర్‌కు తేలుకాటు వేసింది. దీంతో ఆస్పత్రి వెళ్లడం కోసం 108కి ఫోన్ చేశారు. మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి నిమ్మగూడెం బయలుదేరిన 108 అంబులెన్స్ బొర్రవాగు వద్దకు చేరుకుంది. వరద నీరు కాజ్‌వేపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అక్కడే నిలిచింది. దీంతో శంకర్‌ను కుటుంబీకులు బైక్‌పై పోతుల్వాయి వద్ద వాగుకు తీసుకొచ్చారు. అక్కడే ఉన్న స్థానికులు, అధికారులు వాగు దాటించి 108 అంబులెన్స్ ఎక్కించి మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శంకర్ ఆరోగ్యం బాగానే ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు. కాగా, గతంలో రోగులను తీసుకురావడానికి వెళ్లాల్సిన అంబులెన్స్ పలుమార్లు వరదనీటి ప్రవాహానికి ఇక్కడే నిలిచిన ఘటనలు ఉన్నాయి.

గోదావరిలో వ్యక్తి గల్లంతు


రాజు (ఫైల్)

వెంకటాపురం(కె): గోదావరి నదిలో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపుం (కె) మండలం ఆలుబాక పంచాయతీ పరిధి తానిపర్తిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బానారి రాజు (45) గురువారం ఉదయం కుటుంబ సభ్యులకు చెప్పి గోదావరిలో చేపల వేటకు వెళ్లాడు. అయితే శుక్రవారం ఉదయం వరకూ ఇంటికి రాకపోవడంతో రాజు భార్య సమ్మక్క, కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. గ్రామస్తులకు తెలపడంతో వారు రాజు ఆచూకీ కోసం శుక్రవారం ఉదయం నుంచి నాటు పడవల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాజు గల్లంతైన విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాలింపు చర్యలు ముమ్మరం చేశారు

ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి

- కేయూ పాలకమండలి సభ్యుడు సురేష్‌లాల్


పాలకమండలి సభ్యులతో అసోసియేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యనివర్సిటీలో సాంకేతిక ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కేయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య సురేష్‌లాల్ అన్నారు. యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన సాంకేతిక ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేయూ టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీలో సాంకేతిక ఉద్యోగులకు ఉన్న పదోన్నతులు కేయూలో లేవన్నారు. ఇక్కడ ఒకే పోస్టులో జాయిన్ అయి అదే పోస్టులో ఉద్యోగ విరమణ పొందుతున్నారని అన్నారు. అనంతరం నూతన పాలకమండలి సభ్యులు ఆచార్య సురేష్‌లాల్, డాక్టర్ సుదర్శన్, రమ, డాక్టర్ చిర్రరాజులను సన్మానించారు. ఈ సందర్భంగా పుల్లా శ్రీనివాస్ పాలకమండలి సభ్యులకు ఐఏఎస్ వెంకటేశం రచించిన సెల్ఫీ ఆఫ్ సక్సెస్ బుక్‌ను బహూకరించారు. కార్యక్రమంలో వినయ్యయ, ప్రేమ్‌సాగర్, రాము, బాబు, బొక్క మొగిలి, ఆక్రమ్, భవానీప్రసాద్, జహీర్‌ఖాన్, భాస్కర్, జయాకర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ పరిధిలో సెక్యూరిటీ సర్వీస్ ఏర్పాటు

- కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి


ఉత్తర్వులు అందజేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్, ఖమ్మం, కొత్తగూడెం పీజీ సెంటర్లలో నూతనంగా సెక్యూరిటీ సర్వీసెస్‌ను ఆగస్టు 1వ తేదీ నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి వెల్లడించారు. ఈమేరకు కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ అనుమతి మేరకు ఈ సెక్యూరిటీ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు శుక్రవారం తెలిపారు. యూనివర్సిటీ పరిధిలో మొత్తంగా 133మంది శిక్షణ పొందిన సెక్యూరిటీని నియమించామన్నారు. ఆరుగురు సెక్యూరిటీ పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు. వీరిని 11నెలల కాలానికి నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశామని తెలిపారు. టెండర్ ప్రక్రియ ద్వారా పాల్వంచలోని ఇండస్ట్రియల్ డిటెక్టివ్ సర్వీసెస్ సంస్థకు చెందిన సెక్యూరిటీ వ్యవస్థకు బాధ్యతలు అప్పగించామని తెలిపారు. కేయూ అభివృద్ధి అధికారి ఆచార్య వాసుదేవరెడ్డి, ఫైనాన్స్ ఆఫీసర్ రాజయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రణయ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వంగపహాడ్‌లో పోలీస్ ఔట్‌పోస్ట్ రీ ఓపెన్

- తొమ్మిదేళ్ల తర్వాత పునఃప్రారంభానికి చర్యలు


పునఃప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఔట్ పోస్ట్

హసన్‌పర్తి: వంగపహాడ్‌లో తొమ్మిదేళ్ల తర్వాత పోలీస్ ఔట్‌పోస్ట్ పునఃప్రారంభంకానుంది. వంగపహాడ్‌లోని ఓ వీధిలో వేశ్య గృహాలు ఉన్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన యువతులను ఖరీదు చేసి.. ఇక్కడికి తీసుకొచ్చి వ్యభిచారం చేయించేవారు. పోలీసులు దాడుల సందర్భంగా వారు పట్టుబడి కేసులు పాలైన దాఖలాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ ఫలితం కానరాలేదు. ఈ క్రమంలో వేశ్య గృహాల్లోకి విటుల తాకిడిని నివారించడానికి 2010లో ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసి, ఏఎస్సై స్థాయి అధికారికి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. దీంతో విటుల రాకపోకలు తగ్గాయి. ఐదేళ్లపాటు ఇక్కడ ఔట్ పోస్ట్ కొనసాగింది. 2015లో ఎలాంటి కారణం లేకుండానే ఎత్తేశారు.

తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ..

తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఔట్‌పోస్ట్‌ను రీఓపెన్ చేయడానికి రంగం సిద్ధం చేశారు. ఈమేరకు పాత గదిని వినియోగంలోకి తీసుకొచ్చారు. ఔట్ పోస్ట్‌ను ప్రారంభించనుండడంతో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారు ఆందోళనకు గురవుతున్నారు. వారం క్రితం టాస్క్‌ఫోర్స్ నిర్వహించిన దాడుల్లో ముగ్గురు మైనర్లు వ్యభిచారం చేస్తూ పట్టుబడ్డారు. దీంతో వేశ్య గృహ నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

స్పష్టత రాకముందే బేరసారాలు..

ఇదిలా ఉండగా ఔట్‌పోస్ట్ రీఓపెన్‌పై స్పష్టత రాకముందే పోలీసులతో వేశ్య గృహ నిర్వాహకులు బేరసారాలకు దిగినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా ఈవిషయమై కాజీపేట ఏసీపీని అడగగా ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసే అవకాశం లేదన్నారు.

ఉద్యోగులు పోటీతత్వంతో పని చేయాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: అధికారులు, ఉద్యోగులు పోటీతత్వంతో పనిచేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ 16 సర్కిళ్ల పరిధిలో తమ పనితీరులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు వివిధ కేటగిరీల్లో నెల నెలా ర్యాంకులు ప్రకటిస్తున్నారు. మే నెలలో ప్రతిభ కనబరిచిన అధికారులకు శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని ప్రధాన కార్యాలయంలో సీఎండీ వరుణ్ రెడ్డి ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందించారు. ఎన్పీడీసీఎల్ స్థాయిలో డీఈల విభాగంలో 3వ స్థానంలో నిలిచిన హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబారెడ్డి, ఉమ్మడి వరంగల్ ఏడీఈ విభాగంలో ప్రతిభ కనబరిచిన హనుమకొండ ఏడీఈ పి.మల్లికార్జున్, ఏఈ విభాగంలో హనుమకొండ నక్కలగుట్ట ఏఈ ఎం.ప్రవీణ్ హనుమకొండ సర్కిల్ పరిధిలో దామెర ఏఈ రమేశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో బెస్ట్ ఇంప్రూవ్‌మెంట్ అచీవ్ హనుమకొండ సుబేదారి ఏఈ సి.హెచ్.నవీన్ కుమార్, హనుమకొండ సర్కిల్ బెస్ట్ ఇంప్రూవ్‌మెంట్ అచీవ్‌గా ఏఈ ఐనవోలు బి.పద్మకు సీఎండీ వరుణ్ రెడ్డి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.మధుసూదన్, సీజీఎం కె.కిషన్, హనుమకొండ సర్కిల్ ఎస్.ఈ కె.వెంకటరమణ, హనుమకొండ రూరల్ డివిజన్ డీఈ బి.సామ్య నాయక్, ఏడీఈ దేవేందర్ పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలి

- ప్రొఫెసర్ కంచె ఐలయ్య


అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ కంచె ఐలయ్య, విద్యార్థి, ప్రజా సంఘాల బాధ్యులు

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రానికి ప్రజా యుద్ధనౌక గద్దర్, చుక్క సత్తయ్య పేరు పెట్టాలని ప్రొఫెసర్ కంచె ఐలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 'తెలంగాణ ఉద్యమం–గద్దర్ పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో కంచె ఐలయ్య ముఖ్య అతిథిగా మాట్లాడారు. కవి పేరు కళాక్షేత్రానికి ఎలా పెడతారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ తల్లి, తెలంగాణ లోగో, పాటను మార్చిన తీరుగానే కాళోజీ కళాక్షేత్రానికి గద్దర్, చుక్క సత్తయ్య పేరు పెట్టాలన్నారు. వరంగల్‌లో చుక్క సత్తయ్య, శంకర్, సారంగపాణి వంటి కళాకారులు, మొగిలయ్య వంటి మొదటి తెలంగాణ ఉద్యమకారుడు ఉండగా కాళోజీ పేరు పెట్టడం కులతత్వం కాదా.. అని ప్రశ్నించారు. గద్దర్‌ను మించిన సాహిత్యకారుడు, కళాకారుడు, నటుడు ఎవరూ లేరన్నారు. ఎన్టీఆర్‌ను మించిన నటుడన్నారు. ఆగస్టు 6వ తేదీన మొదటి వర్ధంతి లోపు వరంగల్‌లో గద్దర్ విగ్రహం ఏర్పాటు, కళాక్షేత్రానికి గద్దర్ నామకరణంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. గద్దర్ గళం అసోసియేషన్ అధ్యక్షుడు సత్తయ్య, మిత్రులు రూ.40లక్షల ఖర్చుతో విగ్రహాన్ని తయారు చేయించినట్లు తెలిపారు. హెల్త్ యూనివర్సిటీకి ఒక కవి పేరు పెట్టడం విచిత్రంగా ఉందన్నారు. వరంగల్‌లో గద్దర్ 10లక్షల మందితో సభ పెట్టి మొదటిసారి ప్రత్యేక తెలంగాణ తీర్మానం చేశారని గుర్తు చేశారు. గిరిజన యూనివర్సిటీకి సమ్మక్క, సారలమ్మ పేరు పెట్టినట్లుగానే తెలంగాణలోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. గద్దర్ గళం అసోసియేషన్ కార్యదర్శి పసునూరి రవీందర్ మాట్లాడుతూ.. దేశంలో సాంస్కృతిక విప్లవానికి పురుడు పోసిన మహా కళాకారుడు, వాగ్గేయకారుడు గద్దర్ అని అన్నారు. మంత్రులు, కలెక్టర్, అధికారులు ఈ దిశగా ఆలోచన చేయాలన్నారు. గద్దర్ గళం అసోసియేషన్ చైర్మన్ కొల్లూరి సత్తయ్య, ఆయా సంఘాల నాయకులు నలిగంటి శరత్, దూడపాక నరేశ్, కన్నం సునీల్, మేడ రంజిత్, కాడపాక రాజేందర్, ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, దర్శన్ పాల్గొన్నారు.

రూ.36,075 విలువైన గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన టౌన్ సీఐ దేవేందర్


వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఓ వ్యక్తి మరొకరికి విక్రయించేందుకు యత్నిస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి వారివద్ద నుంచి కిలో 443 గ్రాముల సరుకు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం రాత్రి తెలిపారు. టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వీఆర్ఎన్ గార్డెన్స్ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఒడిశాలోని కోరాపూట్ జిల్లా లంతపూర్ బడిగాడ గ్రామానికి చెందిన బలభద్రఖర మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని హన్మంతునిగడ్డ హరిజనవాడకు చెందిన కారపాటి వాసుకు గంజాయి అమ్మేందుకు వచ్చానని ఒప్పుకున్నాడు. దీంతో వారివద్ద నుంచి కిలో 443 గ్రాముల (విలువ రూ.36,075) గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. టౌన్ ఎస్సైలు విజయ్ కుమార్, అరుణ, హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అలీ, పీసీలు శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.

రూ. 8.80 లక్షల విలువైన నిషేధిత గుట్కా స్వాధీనం

రామన్నపేట : మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధి డాల్ఫిన్ గల్లీలో వ్యాపారి రాజపురోహిత్ జబ్బార్ వద్ద నుంచి రూ. 6,39,400 విలువైన ప్రభుత్వ నిషేధిత గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ శుక్రవారం తెలిపారు. అలాగే, కాకతీయ థియేటర్ సమీపంలో మరో వ్యాపారి కళారియా రాజా వద్ద నుంచి రూ. 2,40,000 గుట్కా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో మొత్తం రూ 8.80 లక్షల విలువైన గుట్కా స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ పేర్కొన్నారు.

నమ్మకంగా పనిచేసి నట్టేట ముంచి..

బంగారం చోరీ కేసులో ఘరానా దొంగ అరెస్ట్

- రూ.52 లక్షల విలువైన 700 గ్రాముల బంగారం బిస్కెట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిశోర్ ఝా


వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్‌కిశోర్ ఝా, పక్కన పోలీసు అధికారులు

వరంగల్ క్రైం: బంగారం కరిగించే షాపులో నమ్మకంగా పనిచేస్తూ అదును చూసి భారీ మొత్తంలో బంగారం చోరీ చేసిన ఘరానా దొంగను సీసీఎస్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. నిందితుడి నుంచి సుమారు రూ. 52 లక్షల విలువైన 700 గ్రాముల బంగారం బిస్కెట్లతో పాటు ఓ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా సాల్సింగే తాలూకా భాగ్యనగర్ ప్రాంతానికి చెందిన సురేశ్ లక్ష్మణ్‌బాద్ ఒంటరిగా జీవిస్తూ బంగారం వ్యాపారం చేసేవాడు. ఈ వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయం జల్సాలకు సరిపోకపోవడంతో అప్పుల పాలయ్యాడు. అప్పు తీర్చాలంటే బంగారం దుకాణంలో నమ్మకంగా పనిచేసి పెద్ద మొత్తంలో చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా వరంగల్ విశ్వకర్మ వీధిలో బంగారం కరిగించే బట్టీ వ్యాపారి సంజయ్ వద్ద గత మే నెల 24తేదీన పనిలో చేరాడు. కొద్ది రోజులు నమ్మకంతో పనిచేశాడు. దీంతో దుకాణ యజమాని సంజయ్.. సురేశ్ లక్ష్మణ్‌బాద్‌కు షాపు తాళాలు అందజేసి బయటకు వెళ్లేవాడు. ఈ క్రమంలో గత నెల జూన్ 14వ తేదీన సంజయ్ పనిపై బయటకు వెళ్లడంతో ఇదే అదునుగా భావించిన సురేశ్ లక్ష్మణ్‌బాద్ షాపులోని సీసీ కెమెరాలు బంద్ చేసి 8 వందల గ్రాముల బంగారం చోరీ చేసి పరారయ్యాడు. ఈ ఘటనపై షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీ రవి ఆధ్వర్యంలో సీసీఎస్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశారు. చోరీ సొత్తును అమ్మేందుకు ఈనెల 18న రైలులో సికింద్రాబాద్ నుంచి విజయవాడకు వెళ్తుండగా వరంగల్ రైల్వే స్టేషనలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తనిఖీ చేయగా చోరీ సొత్తు లభించడంతో స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీపీ తెలిపారు. చోరీ అనంతరం నిందితుడు పూణెలోని నస్రాపూర్‌లో బంగారం కరిగించే బట్టీ వ్యాపారం నిర్వహిస్తున్న తన మిత్రుడు సూరజ్ తానాజీ యాదవ్ వద్ద చోరీ సొత్తు కరిగించాడు. వంద గ్రాముల చొప్పున ఎనిమిది బిస్కెట్లుగా మార్చి అందులో వంద గ్రాముల బంగారం సూరజ్ తానాజీ యాదవ్‌కు విక్రయించాడు. మిగతా 700 గ్రాముల బంగారం విజయవాడలో విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులకు చిక్కినట్లు సీపీ తెలిపారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు ఏడాది జైలు

గీసుకొండ: బస్సును అజాగ్రత్తగా, అతి వేగంగా నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. గీసుకొండ సీఐ బాబులాల్ కథనం ప్రకారం.. 2017 ఫిబ్రవరి 16న సంగెం మండలం వెంకటాపురానికి చెందిన తాళ్లపెల్లి మధు తన బైక్‌పై గీసుకొండ మండలం ధర్మారం వెళ్లి తిరిగి స్వగ్రామం పయనమయ్యాడు. అదే సమయంలో నర్సంపేట వైపు నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ధర్మారం రైల్వే గేటు ఎదుట బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే ధర్మారం బస్టాండ్ హోటల్ ఎదుట నిలబడిన నలుగురిని బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై మృతుడి భార్య మానస పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి గీసుకొండ ఎస్సై వి.నవీన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు కానిస్టేబుల్ చంద్రయ్య సాక్షులను ప్రవేశపెట్టారు. వాదోపవాదాలు విన్న వరంగల్ మేజిస్ట్రేట్.. నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ దంతాల శ్రీనాథ్‌కు సంవత్సరం జైలు శిక్ష, రూ. 1500 జరిమానా విధించారు.